ముగిసిన పోలీసు కస్టడీ

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై అరెస్టయి విశాఖ సెంట్రల్‌జైలులో ఉన్న నిందితుల పోలీసు కస్టడీ బుధవారం సాయంత్రంతో ముగిసింది. విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌ను వారం రోజులు పోలీసు కస్టడీకి అప్పగిసూ జిల్లా కోర్టు ఈనెల 23న తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. నిందితులను ఎన్‌ఐఎ, యాంటీ టెర్రరిస్టుస్క్వాడ్, కౌంటర్ ఇంటెలిజెన్సు అధికారులు పోలీసు శిక్షణ కళాశాలలో విచారించారు. ఈ సందర్భంగా వారి నుంచి పలు కీలక అంశాలను రాబట్టినట్లు తెలిసింది. కస్టడీ సమయం ముగియడంతో నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. వారికి ఈనెల 30వరకు కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు.

జిల్లా అంతటా వర్షాలు

అత్యధికంగా గంట్యాడలో 61.2 మి.మీ వర్షపాతం

నువ్వు పంటకు నష్టం

ఖరీఫ్ పనులకు సిద్ధమవుతున్న రైతులు

ముసురేసింది

ముక్కాంలో ముందుకొచ్చిన సముద్రం

గజపతినగరం మండలంలో నీట మునిగిన నువ్వు చేలు

ప్రజాశక్తి-గజపతినగరం, భోగాపురం

అల్పపీడన ప్రభావంతో విజయనగరం జిల్లా అంతటా ముసురేసింది. జిల్లా వ్యాప్తంగా బుధవారం 27.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా గంట్యాడ మండలంలో 61.2 మి.మీ, రాజాంలో 48.5మి.మీ, వేపాడలో 48.3 మి.మీ వర్షం కురిసింది. మిగతా అన్ని మండలాల్లోనూ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ ముందుగానే వస్తుందంటూ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు ఎరువులు, విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గజపతినగరం మండలంలో నువ్వు పంటకు నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు కురవడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో పంట నువ్వు చేలో నీరు నిల్వ ఉండడంతో పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భోగాపురం మండలంలోని తీర ప్రాంతమైన ముక్కాం గ్రామంలో సముద్రం 300 మీటర్లు ముందుకు వచ్చింది. ఒడ్డున వలలు దాచుకున్న పాకలకు నీరు తాకడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజుల నుంచి ఈ పరిస్థితి ఉందని చెబుతున్నారు. గతంలో ఎన్నడూ సముద్ర ఎంత ముందుకు రాలేదని ఇప్పుడు మాత్రం ఉదయం పూట భారీ అలలతో తీరం కూడా కోతకు గురైందని అంటున్నారు.

హైరిస్క్ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు

జిల్లాలో నదులు, వాగులు, చెరువులు తదితర నీటి వనరుల్లో ప్రమాదవశాత్తూ వ్యక్తులు మునిగి మరణించే పరిస్థితుల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో మునకకు అవకాశం ఉన్న హై రిస్క్ ప్రదేశాలను వెంటనే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఆయా ప్రదేశాల్లో ఎక్కడ నీటిలో దిగడం ప్రమాదకరమో తెలియజేస్తూ పెద్దగా, స్పష్టంగా కనిపించేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగినపుడు సహాయం కోసం ఎవరిని సంప్రదించాలనే సమాచారాన్ని ఆయా హెచ్చరిక బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు.

వర్షపాతం వివరాలు

వంగర మండలంలో 2.2 మి.మీ, రేగిడి 9.6, సంతకవిటి 9.7, రాజాం 48.5, బొబ్బిలి 26.4, రామభద్రపురం 47.2, బాడంగి 39.0, తెర్లాం 47.7, మెరకముడిదాం 44.2, దత్తిరాజేరు 12.7, మెంటాడ 35, గజపతినగరం 37, గరివిడి 32.6, చీపురుపల్లి 44.8, గుర్ల 8.4, బొండపల్లి 44.2, గంట్యాడ 61.2, శృంగవరపుకోట 16.5, వేపాడ 48.3, లక్కవరపుకోట 16.4, కొత్తవలస 24.1, జామి 19.2, విజయనగరం 19.4, నెల్లిమర్ల 10.1, పూసపాటిరేగ 11, డెంకాడ 19.4, భోగాపురం మండలంలో 3.5మి.మీ.వర్షం కురిసింది.

ప్రైవేటు హోటళ్లకు ప్రభుత్వ స్థలాలు

- ఎయిర్‌పోర్టు ప్రాంతంలో సన్‌రేకు 3.10 ఎకరాలు
- భీమిలి పరిధిలో మరో రెండు హోటళ్లకు ఇప్పటికే ఇచ్చేసిన వైనం
- ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో చకచకా కట్టబెట్టేస్తున్న ప్రభుత్వం
- స్థలాలన్నీ రూ.కోట్ల విలువైనవే

అన్నవరం వద్ద మే ఫెయిర్ గ్రూప్ హోటల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు హోటళ్ల నిర్మాణానికి కట్టబెట్టేస్తున్నారు. ఎయిర్‌పోర్టుకు ఆనుకునివున్న భోగాపురం మండలం కంచేరు రెవెన్యూ పరిధి 227/1లో 3.10ఎకరాలను 'సన్ రే, అవని' సంస్థలకు హోటల్ పేరిట కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్ ప్రకారం రూ.15 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అంతకు ముందే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు సమీపంలోవున్న విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరంలో రెండు చోట్ల స్థలాలు కేటాయించారు. ఇది చాలదన్నట్టు మరికొన్ని చోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను పర్యాటకాభివృద్ధి పేరిట హోటళ్లు, రిసార్ట్స్, కన్వెక్షన్ హాల్స్ పేరిట ప్రైవేటు సంస్థలకు ఉదారంగా భూములు కేటాయించేందుకు ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. 2026 జూన్ నాటికి ఎయిర్‌పోర్టు తొలిదశ నిర్మాణాలను పూర్తిచేసి, విమాన సర్వీసులను ప్రారంభిస్తామంటూ ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సంస్థల కళ్లు పడ్డాయి. కారు చౌకగా స్థలాలను వశపర్చుకునేందుకు ప్రభుత్వ పెద్దలతో లాబీయింగ్ మొదలైంది. వారు అడిగిందే తడవుగా విలువైన ప్రభుత్వ స్థలాలను కట్టబెట్టేందుకు సన్నాహాలు మొదలవుతున్నాయి. ఇందులో భాగంగానే ఈనెల 16వ తేదీన పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఎయిర్‌పోర్టు - తీర ప్రాంతంలో పర్యటించారు. అదే రోజు కంచేరు వద్దగల స్థలాన్ని సన్‌రే-అవని సంస్థలకు కేటాయిస్తూ ప్రతిపాదనలు పంపాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వాస్తవానికి ఈ స్థలాన్ని ఇప్పటికే సన్ రే రిసార్ట్ సంస్థ ఆక్రమణలో ఉంది. దీన్ని చట్టపరం చేసుకునేందుకు అడిగిందే తడవుగా ప్రభుత్వం సిద్ధపడినట్టుగా అర్థమౌతోంది. ఎయిర్‌పోర్టుకు ఆనుకువున్న భీమిలి పరిధిలోని అన్నవరం సముద్ర తీరంలో మే ఫెయిర్, ఒబెరాయ్ గ్రూపులకు చెందిన హోటళ్లకు అప్పటికే 18.70 ఎకరాలను కేటాయించారు. విలువైన ప్రభుత్వ స్థలాలను దారాదత్తం చేయడానికి బదులు అదే స్థలాల్లో ప్రభుత్వం తరపున అవసరమైన సదుపాయాలు కల్పిస్తే ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి కూడా మేలు జరిగే అవకాశం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం సంబంధిత స్థలాలను 22ఎ (ప్రభుత్వ పరిధి) నుంచి తప్పించేందుకు తహతహలాడుతున్న ప్రభుత్వం, ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం పుట్టిపెరిగిన ఊళ్లు, తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములు త్యాగం చేసినవారికి మాత్రం న్యాయం చేయడం లేదు. ఇప్పటికీ గూడెపువలస, లింగాలవలస నిర్వాసిత గ్రామాలు 22ఎ (ప్రభుత్వ పరిధి)లోనే ఉన్నాయి. దీంతో, ఆయా గ్రామాల్లోని కుటుంబాలవారు అత్యవసర పరిస్థితుల్లో తమ ఇళ్లను తాకట్టుపెట్టుకోవాలనుకున్నా వీలు కావడం లేదు. 22ఎ నుంచి తమ గ్రామాలను తప్పించాలంటూ అనేక సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోని ప్రభుత్వం హోటళ్లు, తదితర పర్యాటకాభివృద్ధి పేరిట ప్రైవేటు సంస్థలకు మాత్రం లాభం చేకూరుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

4న ప్రజా వంచన దినాన్ని విజయవంతం చేయండి

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి జూన్ 4న జరిగే ప్రజా వంచన దినంగా చేపట్టే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పరిశీలకులు కిల్లి సత్యన్నారాయణ కు కోరారు. బుధవారం వైసిపి జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ లెవల్‌నుంచి సంస్థగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ అడుగులు వేస్తోందన్నారు. గ్రామస్థాయి వరకూ కమిటీల నియామకం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అంకితభావం, కష్టపడేతత్వం, కెపాసిటీ ఉండే వ్యక్తులకు పార్టీ కమిటీల నియామకంలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీ పిలుపు మేరకు ప్రతీ కార్యక్రమంలో చురుగ్గా.గ్రామ స్థాయిలో పాల్గొనాలన్నారు. వైసిపి అనుబంధ విభాగాలన్నీ పార్టీకి వెన్నెముకలాగా ఉండాలన్నారు. పార్టీ అనుబంధ విభాగాలన్నీ సోషల్ మీడియాను విస్తతంగావాడుకోవాలన్నారు. ప్రజలను విస్మరించి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను జనంలోకి తీసుకెళ్ళడంలో అనుబంధ విభాగాలు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రజలకు మాట ఇచ్చి తప్పిన కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేక పోరాటాలకు సంసిద్ధంగా ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను జనంలోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4న వెన్నుపోటు దినంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ రోజున ప్రజలతో కలిసి నిరసనలు చేపట్టడం, కలెక్టర్లను కలిసి హామీల డిమాండ్ పత్రాలను అందజేయాలన్నారు. చంద్రబాబు చేసిన మోసానికి నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

మత సామరస్యాన్ని కాపాడుకోవాలి

సదస్సులో సిపిఎం నాయకులు

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు టివి రమణ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

ఉగ్రవాదం నుంచి దేశ సమగ్రతను, మతసామరస్యాన్ని కాపాడుకోవడం ప్రజల తక్షణ కర్తవ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ అన్నారు. 'ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం - మత సామరస్యాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో సిపిఎం ఆధ్వర్యాన బుధవారం ఎన్‌జిఒ హోంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దు చేసినప్పటికీ కాశ్మీర్ సమస్యను పరిష్కరించలేక పోయిందని అన్నారు. కాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్ర దాడి చాలా అమానుషమని, దీన్ని అందరూ ఖండించాలన్నారు. ఉగ్రవాద దాడుల్ని అరికట్టేందుకు మన సైన్యం వీరోచిత పాత్ర పోషించిందని, అన్ని రాజకీయ పార్టీలు సంస్థలు ఐక్యమత్యంగా వారికి బాసటగా నిలిచాయని అన్నారు. అయితే భారతదేశంలో మత ఘర్షణలను పెంచడమే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడి చేస్తే దాని సాకుగా తీసుకుని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లాంటివి హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ ఐక్యతకు విచ్ఛిన్నం చేయడం చాలా దుర్మార్గమని అన్నారు. మతోన్మాదం తప్ప ప్రజల ప్రాణాలకు, సైనికుల త్యాగాలకు బిజెపి ప్రభుత్వం విలువ ఇవ్వడం లేదని అన్నారు. అమెరికాకు లొంగిపోయి షరతులకు ఒప్పుకోవడం వల్ల మన దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భారత్- పాకిస్తాన్ మధ్య ఉగ్రవాద చర్యలను చర్చలతో పరిష్కరించమన్న వారిని దేశ ద్రోహులుగా చిత్రించి దాడి చేయడం బిజెపి కుట్రకు తార్కాణమన్నారు.ఉగ్రవాదులను పట్టుకునే దిశ వైపు ప్రపంచాన్ని ఉంచడం అనే కర్తవ్యం పక్కకు పోయిందని, అమెరికా చెప్పినట్లు వింటూ మన దేశ సార్వభౌమాధికారాన్ని, స్వతంత్రతను తాకట్టు పెట్టేస్తున్నారని అన్నారు. ఉగ్రవాద దాడి లో చనిపోయిన కుటుంబాలకు కాశ్మీర్ ముస్లింలే సహాయం అందించి ఐక్యతను చాటి చెప్పారు. అలాంటి పరిస్థితిని పక్కదారి పట్టించి మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం అంటే ప్రజలని మరల్చి ఉన్మాదం వైపు నెట్టి రాజకీయ లబ్ధి పొందడానికి తహతహలాడుతున్నట్లు అర్థమవుతుందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన దృష్టి పెట్టి అభివృద్ధి వైపు అడుగులు వేయకుండా ప్రజలను భావోద్వేగాలపై ఉంచి విభిన్నాన్ని పెంచడానికి చూస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉగ్రవాదం నుండి భారతదేశాన్ని కాపాడుకోవడం, దేశ సమగ్రతను, మతసామరస్యాన్ని కాపాడుకోవడం తక్షణ కర్తవ్యమని అన్నారు. అదే సందర్భంలో బిజెపి సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి వాటిపై గట్టి పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, రాకోటి రాములు, హరికృష్ణవేణి, సోములు, అప్పలనర్సయ్య, టి.రాము తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అధిక ఫీజులు, పుస్తకాల విక్రయాలను నిరసిస్తూ

నారాయణ స్కూల్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్పొరేట్ కళాశాలల్లో అధిక ఫీజులు, అధిక ధరలకు పుస్తకాలు విక్రయాలను నిరసిస్తూ నారాయణ స్కూలు వద్ద బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం.. పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించడం గాని, పుస్తకాలపై పాఠశాలల పేర్లు ప్రింట్ చేయడం గానీ ఉండకూడదని చెబుతున్నప్పటికీ నారాయణ పాఠశాలలో పుస్తకాల నుంచి యూనిఫారం, బెల్టుల వరకు పెద్దఎత్తున వ్యాపారం జరుగుతోందన్నారు. మరోవైపు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై భారం వేస్తున్నారన్నారు. అయినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వి. చిన్నబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సోమేష్, ఆర్. శిరీష, పట్టణ అధ్యక్షులు సూరిబాబు, నాయకులు గౌరీ, గుణ, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. రాగల 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలియజేసిన నేపథ్యంలో శిథిల భవనాల సమీపంలో, పెద్దపెద్ద వృక్షాల సమీపంలో ప్రజలు ఉండరాదని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య పనితీరును గమనించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం పై మరింత దృష్టి కేంద్రీకరించి చెత్తాచెదారాలను వెనువెంటనే తొలగించి వేయాలని సిబ్బందికి ఆదేశించారు.

కొనసాగుతున్న యోగా శిక్షణ

ప్రజాశక్తి-గజపతినగరం, విజయనగరంటౌన్, బొబ్బిలి

యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పలువురు యోగా శిక్షకులు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గజపతినగరం, బొండపల్లి మండలాల్లో బుధవారం యోగా ప్రదర్శన, ర్యాలీలు నిర్వహించారు. ముందుగా బొండపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో యోగా ప్రదర్శన జరిగింది. అక్కడినుంచి బజార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించారు. ఎంపిడిఒ కె.తులసీనాథ్, తాహశీల్దార్ డోల రాజేశ్వర్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, మండల అధికారులు, వెలుగు, ఉపాధిహామీ, వైద్యారోగ్యశాఖ, ఐసిడిఎస్ సిబ్బంది, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. బొబ్బిలిలో చిత్రలేఖన పోటీలన ఆర్‌డిఒ రామ్మోహనరావు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఇతర మండల అధికారులు పర్యవేక్షించారు.

విజయనగరం పట్టణంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో యోగా స్ట్రీట్ నిర్వహించారు. కమిషనర్ పి.నల్లనయ్య,జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆధార్ కార్డులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆధ్వర్యంలో జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో నిరాశ్రయులు, అనాధలైన బాల బాలికలకు ఆధార్ కార్డులు జారీ చేసే కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ జూన్ 25 వరకు సర్వే నిర్వహించి వివరాలను సేకరించాలని తెలిపారు. జూన్ 26 నుంచి ఆగస్టు 5లోగా వివరాలు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించాలని, ఆగస్టు 15కల్లా ఈ నివేదికలను జాతీయ న్యాయ సేవ అధికార సంస్థకు పంపించాలని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే యోగాపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థి దశనుండే యోగ పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా అన్ని సచివాలయాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ చిన్నతనం నుండి యోగాసనాలు అభ్యసనం చేయడం ద్వారా చురుకుదనంతో పాటు, మేధోశక్తి పెరిగే అవకాశం ఉందని అన్నారు. తల్లిదండ్రులు ఈ దిశగా పిల్లలను యోగ పట్ల చైతన్యవంతులను చేయాలని కోరారు.

థియేటర్లలో జెసి తనిఖీలు

ప్రేక్షకులకు కల్పిస్తున్న వసతులపై ఆరా

లీలామహాల్ థియేటర్‌లో తినుబండారాలను పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని పలు థియేటర్లలో జిల్లా అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నదీ లేనిదీ, ప్రేక్షకులకు తగిన వసతులు కల్పిస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ లీలామహల్ థియేటర్‌ను, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సవరమ్మ ఎన్‌సిఎస్ థియేటర్‌ను తనిఖీ చేశారు. థియేటర్లలో అగ్నిప్రమాదాల నుంచి రక్షణ కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఫైర్ ఫైటింగ్ పరికరాలను తగినంతగా ఏర్పాటు చేశారా లేదా పరిశీలించారు. క్యాంటీన్ వద్దకు వెళ్లి అక్కడ స్టాల్ లో వున్న తినుబండారాలు పరిశీలించి వాటి ధరలు, నాణ్యతపై ఆరా తీశారు. తినుబండారాల స్టాళ్లను పరిశీలించి స్నాక్స్ ప్యాకెట్లపై వినియోగ తేదీలు సరైన రీతిలో ముద్రించనందున వీటివల్ల ప్రేక్షకుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని, ఇకపై స్థానికంగా తయారయ్యే నాణ్యతలేని పదార్థాలను విక్రయించవద్దని, వినియోగ తేదీ వున్న తినుబండారాలు మాత్రమే విక్రయించాలని థియేటర్ యాజమాన్యానికి స్పష్టంచేశారు.థియేటర్లలో మరుగుదొడ్ల నిర్వహణపై కూడా ఆరా తీశారు. థియేటర్‌లో పారిశుద్ధ్య నిర్వహణ ఇంకా మెరుగుపడాల్సి వుందని యాజమాన్య ప్రతినిధులకు స్పష్టంచేశారు. థియేటర్‌లో ప్రేక్షకులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించామని, ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఆయా థియేటర్లలో వసతులు వున్నదీ లేనిదీ తాము గమనించిన అంశాలతో నివేదిక అందించనున్నట్టు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ చెప్పారు. తనిఖీల్లో ఇన్‌చార్జి తహశీల్దార్ స్వర్ణకుమార్, ఆర్‌ఐ రాజు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నష్టం జరిగితే సహించం

సరాసరి వేతనం రూ.250కు పెరగాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధి హామీ పనులలో కార్మికుల సరాసరి వేతనాలు పెరగకుంటే చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. పేదవానికి మేలు జరగడానికే ఉపాధి హామీ చట్టం ఉందని, కార్మికుల హక్కులను హరించే విధంగా పని చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పనులపై బుధవారం మండల వారీగా కలెక్టర్ సమీక్షించారు. లక్ష్యాల ప్రకారంగా పని దినాలు జరగాలని, వేతనం కూడా 250 వరకు ఈ వారం లోపల పెరగాలని, వచ్చే వారానికల్లా రూ.270 ఉండాలని తెలిపారు. ఏప్రిల్, మే, నెలల లక్ష్యం 1 కోటి 10 లక్షల 93 వేల పని దినాలకు గానూ ఇప్పటి వరకు 70 లక్షల 23 వేల పనిదినాలను సృష్టించారని, ఇది కేవలం 63శాతం మాత్రమేనని, మిగిలిన మూడు రోజుల్లో శత శాతం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. తక్కువ పని దినాలు కల్పించిన మండలాల ఎపిఒలపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎపిడిలు తమ పరిధి లోనున్న మండలాలను ప్రతి రోజు తనిఖీ చేయాలని, పనులు వేగం పెరిగేలా చూడాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ద్వారా చేపడుతున్న బి.టి రోడ్లు, సిసి రోడ్లు, మురుగు కాలవల పనులపై కూడా సమీక్షించారు. సమావేశంలో డ్వామా పీడీ శారదా దేవి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస రావు, ఇఇలు, డిఇలు, ఎఇలు , ఎపిఒలు పాల్గొన్నారు.

సబ్ జైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ బుధవారం విజయనగరం సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించినారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షతా చూపించరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ గురించి తెలిపారు. ఖైదీల పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరింటెండెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. జైలులో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయ సహాయం అందించేందుకు లీగల్ ఎయిడ్ క్లినిక్లను ఏర్పాటు చేశామని, వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ బి.సంపత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు/

నేడు జిందాల్ భూ నిర్వాసితులతో సమావేశం

హాజరు కానున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం భూములు ఇచ్చి నిర్వాసితులైన బాధితులతో మండలంలోని భవాని నగర్ వద్ద గల సాయి భవాని కళ్యాణ మండపంలో గురువారం సమావేశం ఏర్పాటు చేస్తున్నామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ పరిశ్రమ వస్తుందని నమ్మి వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని, అయితే పరిశ్రమ రాకుండా వారు గడిచిన 18 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, భూస్వాములుగా ఉన్నవారు నేడు కూలీలుగా కుటుంబాలతో మిగిలిపోయారని అన్నారు. వీరికి న్యాయం జరిగేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ప్రముఖ న్యాయవాది అల్లు నాయుడు, సిపిఐ రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రతినిధి చల్లా జగన్ తదితరులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా జిందాల్ నిర్వాసితులకు న్యాయం జరిగేలా భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని బాధితులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్సీ కోరారు.

వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - బొబ్బిలి

వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాలువలను శుభ్రం చేసేందుకు డ్రైవ్ నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీలోని అన్ని కాలువలు శుభ్రం చేయాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్డు, కాలువలలో చెత్త వేయకుండా చూడాలన్నారు. ఆమెతో పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- గంట్యాడ

13 సంవత్సరాలు దాటి 19 సంవత్సరాలు నిండిన కిషోర బాలికలు జాగ్రత్తలను పాటించాలని ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి అన్నారు. బుధవారం కొర్లాం గ్రామంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత రాకుండా ఉండడం కోసం జాగ్రత్తలను పాటించాలన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకొని పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి హేమలత, ఎఎన్ఎం శాంతి కుమారి, అంగన్‌వాడి సూపర్‌వైజర్ పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న నాయకులు

వైభవంగా పరదేశమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామ దేవత పరదేశమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ వార్డుల్లో సమస్యలు లేకుండా చూడాలని చైర్ పర్సన్ బంగారు సరోజినీ సూచించారు. బుధవారం ఆమె నగర పంచాయతీ కమిషనర్‌తో కలిసి గాంధీ నగర్‌కాలనీ సచివాలయం పరిధిలోని పలు వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సరోజినీ మంచి నీటిసరఫరా విషయమై వార్డు ఏమినిటీస్ కార్యదర్శులతో మాట్లాడారు. ఆ ప్రాంత వాసులతో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుకుండా రోజు సరఫరా చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది, వార్డులలో గల ప్రముఖులు పాల్గొన్నారు.

మారికను సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోగల మారిక కొండగిరి శిఖర గ్రామం మారికను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల జీవన విధానం పైన వారికి అవసరమైన సౌకర్యాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి వినతి రూపంలో తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు.

బ్రాహ్మణ సంక్షేమంపై తీర్మానం పట్ల హర్షం

ప్రజాశక్తి- విజయనగరం

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద సూర్య చొరవతో బ్రాహ్మణ సంక్షేమ తీర్మానాలను కడప జిల్లాలో నిర్వహిస్తున్న మహానాడు వేదికగా ముసాయిదా తీర్మానాలతో ఏర్పాటు చేయడం హర్షనీయమని రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన జాతీయ అధ్యక్షులు జంధ్యాల బుచ్చిబాబు, ఆర్‌బిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భోగాపురపు వాయునందన శర్మ, జిల్లా అధ్యక్షులు కాళ్ళకూరి వేణుగోపాలరావు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యావత్ బ్రాహ్మణ జాతి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు, యువనేత నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వారు వెల్లడించారు.

'రామతీర్థం' హుండీ ఆదాయం రూ.29లక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

రామ తీర్థం రామస్వామి దేవస్థానం ఆదాయం రూ.29.76 లక్షలు వచ్చింది. బుధవారం దేవస్థానం ఆవరణలో దేవస్థానం సహాయ కమిషనర్ వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ధర్మ హుండీలు లెక్కించిగా ఫిబ్రవరి 28 నుండి ఈ నెల 27 వరకు 89 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చింది. ఈ ధర్మహుండీ లెక్కింపు కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మ దాయ శాఖ నుండి బొబ్బిలి ఇన్‌స్పెక్టర్ ఎన్.రాజకుమారి, చీపురుపల్లి కనకమహాలక్ష్మి కార్యనిర్వాహనాధికారి బి.శ్రీనివాస్, నెల్లిమర్ల పోలీస్ శాఖ, రామతీర్థం గ్రామ సచివాలయం సిబ్బంది. శ్రీవారి సేవా సంఘం, రామతీర్థం గ్రామీణ బ్యాంకు సిబ్బంది, దేవాలయం సిబ్బంది పాల్గొనారు.

విద్యార్థినికి మెమోంటో, ప్రశంస పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్

గురుకుల విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస

ప్రజాశక్తి- వేపాడ

గురుకుల విద్యాలయాల్లో చదవి పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తన కార్యాలయంలో బుధవారం అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. అత్యుత్తమ ఫలితాలు చాటిన ఒక్కక్క పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థినిలు చొప్పున 16 మందిని, ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ అంబేద్కర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు చేతులు మీదుగా మెమోంటో, ప్రశంసా ప్రతాలను అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శత శాతం ఫలితాలను సాధించిన టీచర్స్‌కు కూడా మెమంటో, ప్రశంసా ప్రతాలను అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రిన్సిపాల్స్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్.రూపావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్ టి.జయశ్రీ, రాణిశ్రీ, శ్రీనివాసునాయుడు, కెఎంఆర్ నారాయణరావు, రఘురామనాయుడు, ఉషారాణి, పిల్లలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

ప్రజాశక్తి - బొబ్బిలి

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ జయంతి బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. దక్షిణ దేవుడి వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, సుంకరి సాయిరమేష్, కౌన్సిలర్లు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో బుధవారం ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండల యూనిట్ ఇంఛార్జి సుంకర సాయికృష్ణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రొంగల కృష్ణ, బూడి గాంధీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహానికి బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలా అప్పారావు మాస్టర్, సీనియర్ నాయకులు గొంప దుర్గ ఉమేష్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి పైడినాయుడు, నక్కరాజు చిన్న రాము, ఎల్లపు సూరిబాబు, మొయ్యి గణేష్, మిడతాన కాశి, సారికి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి సర్గీయ ఎన్‌టి రామారావు 102వ జయంతి వేడుకలు బుధవారం స్థానిక రామతీర్థం జంక్షన్, మొయిదలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి ఆధ్వర్యంలో నిర్వహించారు. రామతీర్థం కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, నల్లం శ్రీనివాసరావు, నాయకులు అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు, అవనాపు సత్యనారాయణ, కాళ్ళ రాజశేఖర్, అట్టాడ శ్రీధర్, చందక చిన్నం నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఎస్‌టి టిడిపి కమిటీ నెంబర్ దాసరి లక్ష్మి, నాయకులు పోతల రమణ, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని చింతలవలసలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలవేశారు. అనంతరం కడపలో జరుగుతున్న మహానాడుకు బయలుదేరిన బస్సును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రదీప్ రాజు, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు చిల్ల పద్మ, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి గ్రామ వైస్ సర్పంచ్ చీకటి సుహాసిని, దిండి పెంటరాజు, పిళ్ళా సూరిబాబు, ముని పైడియ్య తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: స్థానిక జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి సీనియర్ నాయకులు, ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు గోవింద్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి పతివాడ

పూసపాటిరేగ: మండల కేంద్రంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర స్థాయి వేడుకగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, మండల కేంద్రంలో మాజీమంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాయకులు, పిల్ల అప్పలనాయుడు, రౌతు స్వామి నాయుడు, బొంతు ఉమా తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కంటోన్మెంట్: పట్టణంలోని కోట వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి నియోజకవర్గ టిడిపి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ప్రసాదుల మహాలక్ష్మి, టిడిపి మహిళా విభాగం జిల్లా కార్యదర్శి అనురాధ బేగం, 49వ కార్పొరేటర్ కర్రోతు రాధమని, పత్తి గుల్ల సూర్యకుమారి, మాజీ కౌన్సిలర్లు మైలపల్లి పైడిరాజు, రాజ్యలక్ష్మి, ఖాదర్, రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద వున్న ఎన్‌టిఆర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎంటి రాజేష్, రంగూరి భరత్, ఎమ్. పవన్ కుమార్, గొల్లపల్లి మహేష్, వజ్రపు నవీన్ కుమార్, పృథ్వీ భార్గవ్, అభిలాష్, వేంకటేష్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గల రోగులకు, వృద్ధులకు రొట్టెలు పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు సాయిరాం, నాయకులు కనిశెట్టి ఈశ్వరరావు, గోగాడ అప్పలసత్యం, బీసెట్టి అరుణ, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్క కిరణ్, క్లస్టర్ ఇంచార్జి కాపుగంటి వాసు, అనకాపల్లి చెల్లయ్య, పెదగాడ రాజు, వసంత సత్యారావు, పాల్గొన్నారు.

తెలుగుజాతికి గుర్తింపు తెచ్చిన మహనీయుడు ఎన్‌టిఆర్ : కలెక్టర్

కంటోన్మెంట్: తెలుగు జాతికి గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిన మహనీయులు నందమూరి తారక రామారావు అని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు. భావితరాలకు ఎన్‌టిఆర్ స్ఫూర్తి ఆదర్శనీయమని అన్నారు. ఎన్టిఆర్ 102వ జయంతి కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థినుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. ప్రముఖ రంగస్థల నటులు కందుల గుణేశ్వరరావు శ్రీకృష్ణుడిగా ప్రదర్శించిన రాయబార ఘట్టం, నంది అవార్డు గ్రహీత ముల్లపూడి రామచంద్రరావు దుర్యోధనుడుగా ప్రదర్శించిన మయసభ ఘట్టం ఏకపాత్రాభినయాలు ప్రేక్షకులకు ఉర్రూతలూగించాయి. నంది అవార్డు గ్రహీత మురళి హార్మోనియంపై వాద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు, జెసి ఎస్.సేతుమాధవన్, డిఆర్‌ఒ మురళి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, ప్రముఖ న్యాయవాది, సాహితీవేత్త ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్‌వి‌ఆర్‌ఎం రాజు, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేష్, సిపిఒ పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జీవిత చరిత్రపై ఫోటో ప్రదర్శన

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా, ఆయన జీవిత చరిత్రపై జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేసింది. కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జెసి సేతు మాధవన్, ఇతర ప్రముఖులు, అధికారులు ఆసక్తిగా తిలకించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ సేవలను కొనియాడారు.



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

ప్రారంభించకుండానే విధులు

◆ అధికారులకు చెప్పకుండా సచివాలయంలోకి మారిన సిబ్బంది ◆ 4 రోజుల నుంచి కొత్త సచివాలయంలోనే.. ◆ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన సచివాలయాన్ని ప్రజా ప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించడం పరిపాటి. అలా కాకుండా కనీసం వారికి సమాచారం లేకపోవడమే కాకుండా అధికారులకు కూడా చెప్పకుండా సిబ్బందే నేరుగా నూతన సచివాలయంలోకి ప్రవేశించి విధులు నిర్వర్తిస్తుండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి మారినప్పుడు కనీసం ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి. కాని మమ్మల్ని ఎవడ్రా అపేది అన్నట్లుగా ఇక్కడి సిబ్బంది కొత్త భవనంలోకి మారి విధులు నిర్వహిస్తున్నారు. ఇది తెలుసుకున్న పంచాయతీలోని జనసేన నాయకులు సచివాలయం సిబ్బంది తీరుపై భగ్గుమంటున్నారు. ఈ విషయాన్ని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. ఇదీ మండలంలోని చెరుకుపల్లి పంచాయతీలో సచివాలయం సిబ్బంది వ్యవహరించిన తీరు.

మండలంలోని చెరుకుపల్లి పంచాయతీలో సచివాలయానికి భవనం లేక అద్దె భవనంలో నడుస్తోంది. దీంతో గత ప్రభుత్వం హయాంలో గ్రామ సచివాలయాన్ని 40లక్షలతో నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సచివాలయాన్ని ప్రారంభించడానికి రెండుసార్లు ప్రయత్నించారు. కాని ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో వాయిదా పడింది.

ప్రారంభించకుండానే సచివాలయంలో సిబ్బంది విధులు

సచివాలయాన్ని ప్రారంభించకుండానే ఇందులో సిబ్బంది విధులు నిర్వహించడం సర్వత్రా విస్మయం కలిగించింది. సాధారణంగా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవాలు చేస్తుండడం ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. ఇక్కడ మాత్రం గ్రామ సర్పంచ్ కొన్ని రోజులు కిందట కొబ్బరికాయ కొట్టి ప్రారంభోత్సవం చేసేశారని అంటున్నారు. అనంతరం పాత అద్దె భవనంలో ఉన్న ఫర్నిచర్‌ను నాలుగు రోజులు కిందట ఆది వారం మొత్తం కొత్త సచివాలయం లోకి మార్చి నట్లు చెబు తున్నారు. అనంతరం సోమవారం నుంచి సచివాలయ సిబ్బంది మొత్తం నేటి వరకు అందులో విధులు నిర్వహిస్తున్నారు. పాత అద్దె భవనంలో నుంచి కొత్త సచివాలయంలోకి మారినట్లు అక్కడ పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి కూడా కనీసం అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం విశేషం. భవనం నిర్మాణం పూర్తయిన తరువాత సంబంధిత కాంట్రాక్టరు నుంచి తాళాలను మండల ఇంజనీరింగ్ అధికారి స్వాధీనం చేసుకోవాలి. అనంతరం మండల ఇంజనీరింగ్ అధికారి ధృవపత్రం ఇచ్చిన తరువాత ప్రారంభోత్సవాలు జరుపుతుంటారు. కాని ఇక్కడ మాత్రం ఇలా జరగకపోవడం విశేషం.

నూతన భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యేకు చెప్పకుండా ఎలా ప్రారంభిస్తారు: జనసేన నాయకులు

తమ గ్రామంలో ఉన్న కొత్త సచివాలయ భవనం ప్రారంభోత్సవం చేయకుండానే గత నాలుగు రోజులు నుంచి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని జనసేన నాయకులు దుర్గాప్రసాద్, జి. నర్సింగరావు తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. ప్రజాప్రతినిధులను ఘోరంగా అవమానించి ఇంత భాద్యతా రహిత్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నూతనంగా నిర్మించిన సచివాలయం

చర్యలు తీసుకుంటాం

పాత అద్దె భవనంలో నుంచి కొత్త సచివాలయం భవనంలోకి సిబ్బంది మారి గత నాలుగు రోజులు నుంచి విధులు నిర్వహిస్తున్నట్లు సిబ్బంది చెప్పలేదు. ఇంత వరకు ఈ విషయం నా దృష్టికి రాలేదు. సచివాలయాన్ని ప్రారంభోత్సవం చేయకుండా అందులో విధులు నిర్వహించడం సరికాదు. సిబ్బంది నుంచి వివరణ కోరి ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

– కె.కిశోర్ కుమార్, ఎంపిడిఒ, భోగాపురం

ఆధార్ లింకు తప్పనిసరి

ప్రజాశక్తి - రామభద్రపురం

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రైతులకు పెట్టబడి సాయంగా అందించనున్న అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులు పొందేందుకు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు ఆదార్ నంబర్ లింకు తప్పనిసరిగా ఉండాలని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. తన కార్యాలయంలో బుదవారం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పేరుతో మంజూరైన నిధులు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం పేరిట మంజూరు చేస్తుందన్నారు. అర్హులైన రైతన్నలకు, కౌలు రైతులకు ఈ నిధులు మంజూరుకు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆదార్ అనుసంధానం తప్పనిసరి అన్నారు. ఆదార్ లింకు లేని వారు సచివాలయాల్లో సంబధిత ధ్రువపత్రాలతో వెళ్ళి నమోదు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం మండలంలోని ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మూల బొడ్డవర గ్రామ సచివాలయ నూతన భవనాన్ని, రైతు సేవా కేంద్రాన్ని, భవాని నగర్ గ్రామ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, బొడ్డవర గ్రామ సర్పంచ్ దేవాపరపు మీన, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విఆర్ఒ మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని వేములపల్లి విఆర్‌ఒగా విధులు నిర్వర్తిస్తున్న చలుమూరు కృష్ణ(49) గుండె సంబంధిత వ్యాధితో బుధవారం మరణించారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చలుమూరు కృష్ణ గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. వ్యాధి తీవ్రతతో బుధవారం మరణించాడు. రెవెన్యూ సిబ్బందితో ఎప్పుడూ సరదాగా ఉండే కృష్ణ మృతిపై సిబ్బంది సంతాపం తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక చర్చి సెంటర్ రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ సమీపంలో బుధవారం ఆర్‌టిసి బస్సు ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు మడిపల్లి శ్రీను (45) దుర్మరణం చెందారు. సీతానగరం మండలం ఆర్ వెంకంపేటకు చెందిన శ్రీను బొబ్బిలిలో పని చేసేందుకు వస్తుండగా బొబ్బిలి నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో బస్సు చక్రం కిందకు పడ్డారు. దీంతో తల పైనుంచి బస్సు చక్రం వెళ్లడం వల్ల తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాద విషయం పోలీసులకు తెలియడంతో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

20 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని భీమవరంలో దాడులు చేసి అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అక్రమంగా మద్యం కలిగి ఉన్నాడని గుర్తించి అరెస్టు చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ రాముడు తెలిపారు. అతని వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా బెల్ట్ షాపులు నిర్వహించినా, మద్యం అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - గుర్లరూరల్

మండలంలో పాలవలస గ్రామానికి చెందిన కోడి సూర్యకాంతం (52) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఈ నెల 24 వతేదీన తన ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందారు. మృతురాలి భర్త కోడి సాయిబాబు ఫిర్యాదు మేరకు గుర్ల ఎఎస్‌ఐ కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్నుల పెంపు దుర్మార్గం : సిపిఎం

ప్రజాశక్తి - బొబ్బిలి

ఆస్తి విలువ ఆధారంగా ఆస్తిపన్ను పెంచేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవ్వడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆస్తి విలువ ఆధారంగా పన్నులు పెంచేందుకు కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సర్వే చేయడం సరికాదన్నారు. ఆస్తిపన్ను ఏడాదికి రూ.1500 కోట్లు ప్రజలపై భారాలు వేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో సర్వే చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్లు విద్యుత్ భారాలు వేసిందన్నారు. ప్రజలపై భారాలు వేసి సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఆస్తిపన్ను, విద్యుత్ భారాలు మోపబోమనని టిడిని మహానాడులో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తిపన్ను పెంపునకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కన్వీనర్ సింగిరెడ్డి గోపాల్, పార్టీ సభ్యులు జి శంకర్రావు, బి వెంకటరమణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

కౌలురైతులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

కౌలుకు భూమి తీసుకుని సాగు చేసే రైతులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని గజపతినగరం వ్యవసాయ సహాయక సంచాలకులు కె మహారాజన్ సూచించారు. బుధవారం పాతబగ్గాం రైతు సేవా కేంద్రంలో కౌలు రైతుల సీసీఆర్ మంజూరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజన్ మాట్లాడుతూ భూమి కౌలుకు తీసుకొని పంట పండించే ప్రతీ రైతు కౌలు కార్డులు తీసుకోవాలని తద్వారా పంట ఋణం, ఈ పంట, పంటను అమ్ముకోవడం, అకాల వర్షాల వల్ల పంట నష్టపోయినప్పుడు పెట్టుబడి సహాయం లాంటివి పొందవచ్చని వివరించారు. భూమి యజమాని భూమి విషయంలో ఎటువంటి అపోహలకూ తావివ్వకుండా కౌలు చట్టం చేయబడిందన్నారు. కౌలు దారునికి కేవలం పంట మీద మాత్రమే హక్కు ఇచ్చారని చెప్పారు.

795 కౌలు కార్డుల టార్గెట్

మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నేటి వరకు 60 వరకు కౌలు కార్డులను మంజూరు చేశామన్నారు. ఇంకా ఎవరైనా కౌలుకు భూమి సాగు చేస్తున్న రైతులుంటే తప్పనిసరిగా సచివాలయంలో ఉన్న ఆర్‌ఎస్‌కె సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. మండలానికి 795 కౌలు కార్డుల టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామా రెవెన్యూ అధికారి అప్పలనాయుడు, గ్రామా వ్యవసాయ సహాయకులు ప్రవీణ్, సర్పంచ్ పద్మ, మాజీ సర్పంచ్ లెంక చిన్నంనాయుడు, పప్పల గురునాయుడు, ఎంపిటిసి పైడితల్లి, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గ్రామ సభలో గుర్తించాలి

రేగిడి: గ్రామ సభలలో కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎఒ గిరడ మురళీకృష్ణ అన్నారు. బుధవారం మునకలవలస, పారంపేట, ఉణుకూరు, అంబాడ గ్రామాల రైతు సేవా కేంద్రాలలో కౌలు రైతుల గుర్తింపు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్యక్రమాలు అన్ని రైతు సేవా కేంద్రాలలో బుధవారం నుంచి జూన్ 2 వరకు ఐదు రోజుల పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు నిర్వహిస్తారన్నారు. అన్ని గ్రామాలలో కౌలు రైతులను గుర్తించి 11 నెలల కాల పరిమితితో కార్డులు ఇవ్వనున్నామన్నారు. ఒక్క ఎకరం పొలం తక్కువ కాకుండా అదే గ్రామంలో కౌలు చేసే రైతులు అర్హులని చెప్పారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ రైతులు అర్హులన్నారు. ఉద్యాన వన, వ్యవసాయ పంటలు అన్నింటికీ ఈ కార్డు అందజేస్తామన్నారు. ఇప్పటికే 55 మంది కౌలు రైతులను గుర్తించామన్నారు.

దావాసమను

మహారాజశ్రీ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. 90 / 2015

బిట్వీన్:

బర్నికాన దేవికుమార్ . . . వాది

అండ్:

లంకలపల్లి మాధవ్ మొ॥ . . . ప్రతివాద్లు

టు: 1 టు 3 ప్రతివాద్లు:

1. లంకెలపల్లి మాధవ్, తండ్రి శంకరరావు
2. లంకెలపల్లి జోజి, తండ్రి శంకరరావు
3. లంకెలపల్లి భార్గవ్, తండ్రి శంకరరావు

జ్న ము॥సా॥ డో.నెం. 8-34, గవర్నమెంటు హైస్కూలు దగ్గర, కొత్తవలస గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా.

పైనెంబరు దావా పరిహారం నిమిత్తం మీ మీదపైన వివరించిన దావాతో పాటు I.A. 172/2025, I.A. 173/2025, I.A.174/2025ర్లులో వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువల్ల **17-6-2025న ఉదయం గం. 10.30 ని॥కు** పై కోర్టులో హాజరుఅయ్యేటట్లు యిందువల్ల మీకు అజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారము వుద్దేశించే యుండే దస్తావేజు లన్నింటిని పై తెలిపిన రోజు హాజరు పర్చుటకు మీకు ఉత్తరవు చేయడమైనది.

పైన చెప్పి దినముందు మీరు హాజరుకాకుండా తప్పినయెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించుట మగునని మీకు తెలియజేయడమైనది.

D.SIVA PRASAD, A.B.BHUSHAN

వాది తరపు అడ్వకేట్, చోడవరం